క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అప్పన్న సన్నిధిలో వీఎంఆర్‌డీఏ చైర్మన్



ప్రణవ్‌గోపాల్‌కు ప్రసాదం అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంను డిప్యూటీ ఈవో రాధ అందించారు.

గెడ్డవాగు ఆక్రమణల ఫిర్యాదుపై పరిశీలన



గెడ్డవాగు ఆక్రమణలపై పరిశీలిస్తున్న జిల్లా ఏడీ సర్వేయర్ గోపాలరాజు తదితరులు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.103, 105, 106లలోని ప్రభుత్వ భూములను జిల్లా ఏడీ సర్వేయర్ ఎస్.గోపాలరాజు శుక్రవారం పరిశీలించారు. సర్వే నెం.106లోని గెడ్డవాగు అక్రమణలపై పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమణపై పరిశీలించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట సచివాలయ సర్వేయర్ లోకేష్ ఉన్నారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట స్థావరాలపై నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. సుజాతనగర్‌లోని ఓ ఇంట్లో, గోపాలపట్నం ప్రాంతంలో ఓ నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శిబిరాలపై దాడిచేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు 14 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.48,620 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఆయా కేసులను పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లకు అప్పగించారు.

97వ వార్డులో ఇంటింటి ప్రచారం



పార్టీ కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డులోని పలు ప్రాంతాల్లో టీడీపీ తొలి అడుగు పేరిట ఇంటింటికీ సుపరిపాలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రజలకు ఏడాది పాలనలో అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై టీడీపీ రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు గండి వంశీదీప్, శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తవ్వవానిపాలెం హైస్కూల్ స్థల ఆక్రమణపై పరిశీలన



పాఠశాల స్థలాన్ని రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖాళీ స్థలం ఆక్రమణపై అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి మండల విద్యాశాఖాధికారి ఎంజే రవీంద్రబాబు శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తోట పద్మావతి పాఠశాల ఖాళీ స్థలం దురాక్రమణపై మండల విద్యాశాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రాథమిక పరిశీలన చేపట్టినట్లు ఎంఈవో తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రాప్తికి పాఠశాల స్థలం సరిహద్దుల్ని నిర్ణయించాలని మండల రెవెన్యూ అధికారి ఆదేశించారని పేర్కొన్నారు. ఎంఈవోతో పాటు వీఆర్వో పి.జగన్నాథరావు, సర్వేయర్ మౌనీష తదితరులు ఉన్నారు.

లాభసాటిగా.. ఉద్యాన సాగు

సబ్బవరం మండల రైతులు ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. పలు రకాల కూరగాయలు, అకు కూరలను ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ లాభాల బాట పడుతున్నారు. నగరానికి సమీపంలోనే **ఉండటం,** రవాణా సౌకర్యాలు **మెరుగవడం** ఓ కారణం. దీంతో **పండిన పంట**లను ఇటు విశాఖ **నుంచి అటు** అనకాపల్లి వరకు **రైతు బజార్లు,** కూరగాయల **మార్కెట్లకు చేర్చి** మూడు సీజన్లలోనూ **మెరుగైన** ఆదాయం పొందుతున్నారు.





పందిళ్ల విధానంలో సాగు చేస్తున్న తీగజాతి పంటలు, (ఇన్‌సెట్) అమృతపురంలో బొప్పాయి సాగులో మల్చింగ్ షీట్‌ను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

- సబ్బవరం మండలంలో ఉద్యాన సాగుకు రైతుల మొగ్గు
- చిన్న కమతాలు, మార్కెటింగ్ సదుపాయాలతో ఆసక్తి
- ఆధునిక సాగు విధానాలను అవలంభిస్తున్న రైతులు
- పందిళ్లు, మల్చింగ్‌కు ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సాహం

సబ్బవరం: మండలంలో చాలా గ్రామాల్లో పంటల సాగు వర్షాధారమే. దీనికి తోడు చిన్నచిన్న కమతాలే ఎక్కువ. ఇక్కడి నీటి ఎద్దడి కారణంగా వరి, చెరకు పంటల స్థానంలో ఉద్యాన పంటలైన కూరగాయలు, ఆకుకూరల సాగు వైపు రైతులు మళ్లుతున్నారు. ప్రస్తుతం మండలంలో 260 నుంచి 300 ఎకరాల్లో వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను ఆధునిక విధానంలో సాగుచేస్తున్నారు. పంట దిగుబడులను విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో విక్రయిస్తూ తమ ఆదాయాలను మెరుగుపరచుకుంటున్నారు.

పందిళ్లపై తీగజాతి పంటలు

పందిళ్ల సాగులో తీగజాతి పంటలైన బీర, దొండ, ఆనబ, కాకర, అగాకర, పొట్లకాయ వంటి పంటలు ఎక్కువగా రైతులు వేస్తున్నారు. ఈ విధానంలో దిగుబడితోపాటు కాయల పరిమాణం కూడా ఎక్కువ. పందిర్ల సాగు విధానంలో శాశ్వత పందిర్లు వేసుకునేందుకు ఎకరాకు రూ.2 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. రైతు ముందుగా ఆ మొత్తం వెచ్చించి పందిర్లు వేసుకోవాలి. ఆ తర్వాత ఉద్యాన శాఖ 50 శాతం(రూ.లక్ష) వరకూ రాయితీ అందిస్తుంది. ఒక రైతు గరిష్ఠంగా ఒక హెక్టార్ భూమిలో ఈ శాశ్వత పందిళ్లు వేసుకుంటే గరిష్ఠంగా రూ.2.5 లక్షల వరకు ఉద్యాన శాఖ రాయితీని పొందవచ్చు.



తీగజాతి పంటల శాశ్వత పందిళ్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కిరణ్మయి, తదితరులు

మల్చింగ్ షీట్‌తో ప్రయోజనాలు బోలెడు

ఉద్యాన పంటల్లో కలుపు నియంత్రణతోపాటు నీటి ఎద్దడిని అధిగమించి, పంటకు తేమ తగ్గకుండా మల్చింగ్ షీట్ దోహదపడుతుంది. దీన్ని ఉద్యాన అధికారులు ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. కలుపు తీసేందుకు కూలీల సమస్యను అధిగమించి, నీటి ఎద్దడి నియంత్రించుకోవచ్చు.

అన్ని రకాల ఉద్యాన పంటలకు మల్చింగ్ షీట్ ఎంతగానో ప్రయోజనకారి. ఒక హెక్టార్ విస్తీర్ణంలో మల్చింగ్ షీట్ కోసం రూ.50 వేలు వరకూ వెచ్చించాలి. ఇందులో ప్రభు త్వం రూ.20 వేలు వరకు రాయితీ అందిస్తుంది.

గత ప్రభుత్వంతో మారిన సాగు తీరు

మండలంలో నీటి ఎద్దడి కారణంగా సంప్రదాయ పంటలైన వరి, చెరకు సాగు కష్టంగా మారింది. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టినప్పటికీ శ్రమ తప్ప, ఆదాయం మిగలని పరిస్థితి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యాన శాఖ పాత్ర కీలకంగా మారింది. స్థానిక పరిస్థితుల ఆధారంగా పంటల సాగుపై అవగాహన పెంచారు. దానికి తోడు రాయితీలు, సలహాలు సూచనలు అందించడంతో రైతులు ఉద్యాన పంటలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకున్నారు. మండలంలో ఎక్కువగా తవ్వవానిపాలెం, అమృతపురం, బాటజంగాలపాలెం, వంగలి, ఆరిపాక, రాయపుర అగ్రహారం గ్రామాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోంది.

8 ఎకరాల్లో సాగు



బొప్పాయి, కాలీఫ్లవర్, టమాటా, ఉల్లి, అరటి వంటి ఉద్యాన పంటలు సుమారు 8 ఎకరాల్లో సాగుచేస్తున్నాను. సొంత భూమితోపాటు, ఇతర రైతుల నుంచి కౌలు, లీజుకు కూడా కొంత భూమి తీసుకున్నా. ఆధునిక విధానంలో మల్చింగ్ షీట్, పందిళ్లు వేసి మరీ కూరగాయలు సాగుచేస్తున్నాం. ప్రభుత్వ రాయితీ ఆసారాగా నిలవడంతో ఏక కాలంలో వేర్వేరు పంటలు సాగు చేస్తూ, నాలుగు రూపాయలు వెనకేసుకోగలుగుతున్నాం. – చీపురుపల్లి బంగారి రాజు, ఉద్యాన రైతు, అమృతపురం

రాయితీతో ప్రోత్సాహం



ఉద్యాన పంటల సాగుకు సబ్బవరం మండలం చాలా అనుకూలం. గ్రామాల్లో రోజురోజుకూ ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహం ఉంది. పందిళ్ల విధానంలో తీగజాతి పంటల సాగు లాభదాయకం. కలుపు నియంత్రణకు మల్చింగ్ షీట్ వేసుకోవడం మేలు. వీటికి ప్రభుత్వం 50 శాతం వరకూ రాయితీ అందిస్తోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి, సబ్బవరం

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం జరిపారు. విశేష పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఆర్టీసీ స్థలాల పరిరక్షణకు ఆందోళన



సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

సింహాచలం: ఆర్టీసీకి చెందిన విజయవాడ గవర్నర్ పేట–2 డిపో, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలను బహుళ జాతి సంస్థ లులూ షాపింగ్‌మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని సింహాచలం ఆర్టీసీ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు డిపో వద్ద ఫెడరేషన్ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎంతో విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఆర్టీసీ స్థలాలను ప్రజా ప్రయోజనాలకు కాకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం కట్టబెట్టడం చాలా హేయమైన చర్యగా ఆక్షేపించారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు పూనుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని, లేదంటే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో డిపో కార్యదర్శి ఈవీఎస్ రాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.ఆర్.కుమార్, ఉప కార్యదర్శులు డీవీ రెడ్డి, ఎస్వీ కుమార్, ఎస్.చలపతిరావు పాల్గొన్నారు.

గంటి, నువ్వు చేలకు మేలు చేసిన వర్షం



రాముడిగారి గ్రామంలో ఏపుగా పెరిగిన నువ్వు పంట



వెన్నలపాలెంలో ఏపుగా పెరిగిన గంటి చేను

పరవాడ: మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలు గంటి, నువ్వు పంటలకు అనుకూలించడంతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. మండలంలోని వెన్నలపాలెం, పరవాడ, తానాం, భర్నికం, పెదముషిడివాడ, కలపాక, స్వయంభూవరం, రావాడ, ధర్మారాయుడుపేట, వాడచీపురుపల్లి, పి.బోనంగి, గొర్లివానిపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో గంటి పంట, సుమారు 15 ఎకరాల్లో నువ్వు పంటను ఈ ఏడాది రైతులు సాగు చేస్తున్నారు. వీటితో పాటు పలు చోట్ల నాటిన సరుగుడు, యూకలిప్టస్ తోటలకు ప్రస్తుత వర్షాలు ఎంతో మేలు చేస్తాయంటున్నారు. మండలంలో పంట పొలాలు పచ్చగా కనువిందు చేస్తున్నాయి.

డీ పట్టా భూమి స్వాధీనం



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ వీరయ్య తదితరులు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్ల నరవ, గంగవరంలో నిబంధనలు ఉల్లంఘించి, క్రయవిక్రయాలు చేపట్టిన సమారు 9 ఎకరాల డి పట్టాను సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ శుక్రవారం రద్దు చేశారు. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన స్థలంలో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్ఏ వినోద్‌లు హెచ్చరికల బోర్డును ఏర్పాటు చేశారు. ఆర్ఐ వీరయ్య తెలిపిన వివరాలు..

వెదుళ్ల నరవ సర్వే నెం.94–3లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిపై గతంలో ఒక వ్యక్తికి ప్రభుత్వం డీ పట్టా ఇచ్చింది. కొంత కాలం వ్యవసాయం చేసిన తర్వాత సదరు రైతు డి పట్టా నిబంధనలు ఉల్లంఘించాడని వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిలో 15 రోజులు క్రితం నోటీసులు అతికించారు. డీ పట్టా ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపిన తహసీల్దార్ పీవోటీ చట్టం–1977 ప్రకారం సదరు రైతులకు ఇచ్చిన డీ పట్టాను రద్దు చేశారన్నారు. ఎవరైనా అక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా డీ పట్టా ఉల్లంఘనలకు గురైన గంగవరం సర్వే నెం.38–3లో సుమారు 4 ఎకరాలకు ఇచ్చిన డీ పట్టా రద్దు చేసి ప్రభుత్వ భూమిలో హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సిరులు కురిపించు.. శ్రీమహాలక్ష్మి



ఎస్‌ఆర్ పురంలో విశేషాలంకరణలో కనకదుర్గమ్మ



పూజలందుకున్న అలివేలు మంగమ్మ



అలివేలు మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



సాధుమఠం సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

- వైభవంగా ప్రారంభమైన శ్రావణమాస పూజలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల దేవాలయాలు

పెందుర్తి: పవిత్ర శ్రావణమాసం తొలిరోజే శుక్రవారం కావడంతో నియోజకవర్గం ఆధ్యాత్మిక చింతనలో పరవశించింది. శ్రావణలక్ష్మి నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాలయాలు కిటకిటలాడాయి. శ్రావణ పూజా మహోత్సవాల్లో భాగంగా చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని పసుపు–కుంకుమలు, పాలు, పంచామృతాభిషేకాలతో అర్చించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. లక్ష్మి, విష్ణు సహస్రనామార్చనలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

- ఎస్‌ఆర్ పురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీమాత ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- సాధుమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.
- పెందుర్తి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- పెందుర్తిలోని మహా కామేశ్వరి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.



విజినిగిరిపాలెంలో కొలువుదీరిన ఉమాదేవి

సింహాచలం: అడవివరంలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవమూర్తిని వేంజేపచేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజ నిర్వహించారు.

- అడవివరంలోని విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన ఉమాదేవిని పలు రకాల పుష్పాలతో, కుంకుమతో పూజలు చేశారు. భక్తులు, గ్రామస్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

రాంకీ ఫౌండేషన్ మొబైల్ మెడికల్ వ్యాన్ ప్రారంభం

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో రాంకీ ఫౌండేషన్ సేవలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రశంసించారు. ఫార్మాసిటీలో శుక్రవారం నిర్వహించిన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ 4వ వార్షికోత్సవంలో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాంకీ ఫౌండేషన్ నిధులతో సమకూర్చిన మొబైల్ మెడికల్ వ్యాన్‌ను ప్రారంభించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. 11 అంగన్‌వాడీ కేంద్రాలు, 6 స్కూళ్లకు ఫౌండేషన్ సమకూర్చిన వంట సామగ్రి, ఫర్నిచర్‌ను ఆయా ప్రతినిధులకు అందించారు. విశాఖ ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.వి.రామిరెడ్డి, మర్రి దివాకర్, శ్రీకాంత్, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి

పెందుర్తి: సంక్షేమ పథకాల అమల్లో, అభివృద్ధి పనులు చేపట్టడంలో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అధికారులు ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. సుజాతనగర్‌లో పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల ప్రగతిని ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం సుజాతనగర్‌లోని జనసేన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన బాండ్‌లను అందించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గొర్లె రామునాయుడు జన్మదినోత్సవం



కేక్ కట్ చేస్తున్న గొర్లె రామునాయుడు

పెందుర్తి: పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గొర్లె రామునాయుడు జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పలు అనాథాశ్రమాలతో పాటు, నిరాశ్రయులకు పండ్లు, రొట్టెలు, భోజనం అందించారు. సాయంత్రం స్థానిక తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానుల నడుమ రామునాయుడు కేక్ కట్ చేశారు. కర్రి పద్మనాభం, గొర్లె రమేష్‌నాయుడు, గొర్లె శ్రీనివాసరావు, కశిరెడ్డి శ్రీనివాసరావు, అవగడ్డ శ్రీనివాసరావు, లెక్కల రమేష్, గొర్లె నాగ చరణ్ తేజ్, సింగంపల్లి వెంకట్రావు, లాలం అప్పలనాయుడు, గుల్లిపల్లి రమేష్‌నాయుడు, నరవ మూలినాయుడు, కిల్లి దేముడు, కిల్లి అప్పారావు, అవగడ్డ సన్యాసిరావు, అవగడ్డ రమణమూర్తి, కాగిత కన్నారావు, నరవ బంగారునాయుడు, నక్కా మహేష్, నరవ హేమంత్, మేడిశెట్టి కనకరాజు, బొబ్బిలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దివంగత మంత్రి ఎస్‌ఆర్‌ఏఎస్‌కు ఘన నివాళి



అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శరగడం చినఅప్పలనాయుడు, వేగి పరమేశ్వరరావు తదితరులు

పెందుర్తి: దివంగత రాష్ట్ర మంత్రి, ఎంపీ ఎస్‌ఆర్‌ఏఎస్ అప్పలనాయుడు 29వ వర్ధంతి సందర్భంగా పెందుర్తిలోని నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు. స్థానిక గౌరీ సేవా సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత శరగడం చినఅప్పలనాయుడు ఎస్‌ఆర్‌ఏఎస్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పెందుర్తితో పాటు జిల్లాకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసి, కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, వ్యాపారవేత్త బుద్ధ శివాజీ, గౌరీ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆదివాసీ సంఘం ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు లకే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి దీసరి భాస్కరరావు మాట్లాడుతూ చినముషిడివాడలోని రాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో ఈ వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాంగి వారి, సీకరి ఈశ్వరరావు, పూజారి పూర్ణచంద్రరావు, పూజారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి'



లంకెలపాలెం కూడలిలో నిరసన ప్రదర్శన చేస్తున్న సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: లంకెలపాలెం కూడలిలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిటు ఆధ్వర్యంలో కూడలిలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ లంకెలపాలెం జంక్షన్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కూడలిలో ఫ్లైఓవర్ నిర్మించాలన్నారు. ఇటీవలి రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంతోష్, రాజేష్, దీపు, వరుణ్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.